# అనగనగా ఒక అమ్మా-నాన్న

కొలపల్లి ఈశ్వర్



**"కంగ్రాట్స్ రావుగారూ! మీరు మాకివ్వాళ గ్రాండ్‌గా పార్టీ ఇచ్చి తీరాల్సిందే!"**

వినయభూషణరావు ఆఫీసులో అడుగు పెడుతూనే పోలో మంటూ అతన్ని చుట్టు ముట్టేశారు అతని కొలీగ్స్ అందరూ.

వారిలో ఓ ఇద్దరి వద్ద 'గీతిక' వీక్లీ ఉండ టం గమనించినందున చెప్పకనే అర్థమైపో యింది వినయభూషణ రావ్‌కి విషయ మేమిటో.

అయినా అర్థంకానట్టే అడిగాడు "దేనికీ?" అని సాగదీస్తూ.

"దేనికా? ఇంత చిన్న వయసులోనే మీ అబ్బాయి రచయితై పోయింది కాకుండా- 'గీతిక' లాంటి పాపులర్ మాగజైన్‌లో ప్రైజ్ కొట్టేసినందుకు. కథల పోటీలో ఫస్ట్ ప్రైజ్ రావడం అంటే సామాన్యం కాదు. అందునా 'గీతిక' లాంటి గొప్ప మ్యాగజైన్‌లో" అన్నాడు సోమేశ్వర్రావ్ అనే ఓ సహోద్యోగి ముందు కొస్తూ.

"ఏదో టైంపాస్ కోసం రాసినట్టున్నాడు. దానిక్కాస్తా ప్రైజొచ్చేసింది." తన కొడుకుని వాళ్లంతా మెచ్చుకుంటున్నందులకు మనసులో మురిసిపోతూనే, పైకి మాత్రం తేలిగ్గా అనే శాడు వినయభూషణరావు.

"అన్నన్నా. అంత సింపుల్‌గా కొట్టేయ బాకండి. 'గీతిక' కండక్ట్ చేసిన పోటీ అంటే కొమ్ములు తిరిగిన రచయితలందరూ పాల్గొం టారు. వాళ్లందర్నీ పక్కకి నెట్టేసి ప్రథమ ప్రయ త్నంలోనే ఇంత మంచి కథ రాసి మీవాడు ఫస్ట్ ప్రైజ్ గెల్చుకోవడం- ఇట్స్ నాట్ ఏన్ ఆర్డినరీ థింగ్! మీవాడు భవిష్యత్తులో చాలా గొప్ప రచయిత అవుతాడు" అన్నాడు పావనమూర్తి అనే అకౌంటెంటు.

"అవునవును. నేను చదివాను. చాలా గొప్పగా ఉంది కథ. కుల వ్యవస్థనీ వరకట్న సమస్యనీ చీల్చి చెండాడుతూ చాలా గొప్పగా హృదయానికి హత్తుకునేలా రాశాడు మీవాడా కథ. ఆ కథలో హీరో బసంత్ లాంటి వాళ్లు నూటి కొక్కరున్నా చాలు ఈ దేశం బాగు పడిపోవడానికి" అన్నాడు సీనియర్ అసిస్టెంట్ చలపతి.

"పువ్వు పుట్టగానే పరిమళిస్తుందన్నట్టు తొలి కథనే ఇంత గొప్పగా రాశాడు మీ అబ్బాయి. ఫ్యూచర్‌లో ఇంకెన్ని విజయాలు సాధిస్తాడో. అలాంటి కొడుకును కన్నందుకు నిజంగా గర్వించాలి మీరు" అన్నాడు టైపిస్ట్ రంగారావు వినయభూషణరావు భుజం మీద చరుస్తూ.

తనయుణ్ణి అందరూ అలా ఆకాశానికెత్తే స్తుంటే ఏ తండ్రి మాత్రం గర్వించకుండా ఉండగలడు?

"మీ అందరి ఆశీర్వచనాల బలం వల్ల నిజంగా మా వాడు అంత పెద్ద రచయిత కాగలగాలే గానీ తండ్రిగా నా కంతకన్నా కావా ల్సిందేముంది?" అన్నాడు వినయభూషణరావు ఆనందంతో కళ్లు రెండూ కాస్త చెమ్మగిల్లగా.

"మరి పార్టీ..." గుర్తు చేశారెవరో.

"ష్యూర్..." అన్నాడు వినయభూషణరావు సంతోషంగా.

❋ ❋ ❋

"కంగ్రాట్స్ సుభద్రగారూ"

మహిళామండలిలో కాలుపెట్టిన వినయ భూషణరావు భార్య క్కూడా అక్కడ భర్తకి ఆఫీ సులో ఎదురైన పరిస్థితి ఇక్కడా ఎదురైంది.

"మీ అబ్బాయి రాసిన కథ అద్భుతంగా ఉంది".

"చాలా గొప్ప కథ. సందేశాత్మకంగా ఉంది. అంత చిన్న వయిలో ఇంత గొప్ప కథ రాయడం రియల్లీ వెరీ వెరీ గ్రేట్".

"మీ అబ్బాయికి ప్రైజ్ రావడం వల్లే - కదా రచయిత పరిచయంతో తల్లిదండ్రులు 'ఫలానా' అంటూ మీ పేర్లు కూడా వేశారు. కన్నవారికి పేరు తెచ్చే ఇలాంటి కొడుకులు అందరికీ పుడతారా? అది మీ పూర్వ జన్మ సుకృతం".

ఇలా అందరూ ఆమె కొడు కుని పొగిడేసి, వాళ్లు కూడా అడిగి మరీ పార్టీ పుచ్చేసుకున్నారు.

కొడుకు సాధించిన ఘన విజయానికి ఆ తల్లి మనసు సంతోషంతో ఉప్పొంగి పోయింది.

❋ ❋ ❋

"మా ఆఫీసులో అందరూ నిన్నిలా పొగిడార్రా" అని తండ్రి.

"మా మహిళా మండలిలో నిన్నంతా తెగ మెచ్చుకున్నార్రా" అని తల్లీ ఆయా విషయా లన్నీ ఎంతో ఉత్సాహంగా చెప్పుకుపోతుంటే...

అమ్మా నాన్నా మంచి ఉత్సాహంతో ఉన్నా రని గ్రహించి తన మనసులోని మాట బైట పెట్టడానికి ఇదే మంచి సమయమనిపించి-

వారి సుపుత్రుడూ కమ్ వర్ధమాన రచయితై నట్టి శ్రీకాంత్ "మీ ఇద్దరికీ ఓ విషయం చెప్పాలి" అన్నాడు కాస్త బిడియంగా తల దించుకుంటూ.

"ఏమిట్రా అది?" అంది తల్లి.

"సంకోచిస్తున్నావ్ దేనికిరా? మీ ఫ్రెండ్సే మైనా పార్టీ అడిగారా? డబ్బేమైనా కావాలా?" అన్నాడు తండ్రి.

"అది కాదు నాన్నా" అన్నాడు శ్రీకాంత్.

"మరి" అన్నట్టుగా చూశారిద్దరూ.

"నేను ఓబులేసు కూతురు కమలని ప్రేమి స్తున్నాను. మీరిద్దరూ ఒప్పుకుంటే పెళ్లి చేసుకో వాలనుకుంటున్నాను" అన్నాడు శ్రీకాంత్ దిం చిన తల ఎత్తకుండానే, భయం భయంగా.

"ఓబులేసు కూతుర్నా? ఆ కులం తక్కువ పిల్లని ఆ కూలి వెధవ కూతుర్ని ప్రేమించడా నికి నీకు సిగ్గులేదూ?" అన్నాడు తండ్రి కోపంగా.

"నీకసలు బుద్ధి జ్ఞానం ఉన్నాయా?" అంది తల్లి అంతకన్నా కోపంగా.

పుత్రోత్సాహం కాస్త మంట గలిసిపోగా వాళ్లిద్దరూ కొడుకుకేసి మింగేసేలా చూశారు.

శ్రీకాంత్ దించిన తల ఎత్తలేకపోయాడు. కానీ, అప్పటికే అతని మనసులో ఒక దృఢ నిశ్చయం బలంగా నాటుకుని ఉంది. ❋